## లాభం ఆశచూపి.. 850 కోట్లు కొట్టేశారు!

మొదటిపేజీ తరువాయి...

చేసుకుని ప్రజలను నమ్మించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. డిపాజిటర్లను ఆకర్షించేందుకు మొబైల్ అప్లికేషన్, వెబ్‌సైట్‌ను రూపొందించాడు. తాము అమెజాన్, బ్రిటానియా, గోద్రేజ్ వంటి పేరొందిన కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని నమ్మబలికారు. ఎవరైనా రూ.25వేల నుంచి రూ.9లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చని, ఏడాదికి 11 నుంచి 22 శాతం లాభం ఇస్తామని ప్రచారం చేశాడు. మొత్తం 6979 మంది డిపాజిటర్ల నుంచి రూ.1700 కోట్లు పెట్టుబడి రూపంలో వసూలు చేశాడు. వీటిని వివిధ రూపాల్లో 14 కంపెనీలలో పెట్టుబడులు పెట్టినట్టు తెలిపాడు. కానీ ఇందులో కొన్ని నకిలీ ఒప్పందాలుగా పోలీసులు తేల్చారు. కంపెనీ యజమానులు కొందరు డిపాజిటర్లకు రూ.850 కోట్లు తిరిగి చెల్లించగా ఇంకా రూ.850కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. నిందితులపై గతంలోనూ మల్టీలెవల్ మార్కెటింగ్ కింద కేసులు నమోదైనట్టు పోలీసులు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఓదెల పవన్‌కుమార్, డైరెక్టర్‌గా పనిచేస్తున్న నెల్లూరి కావ్యను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే వారిని కూడా పట్టుకుంటామని డీసీపీ ప్రసాద్ తెలిపారు. ఈ కేసును ఏసీపీ కళింగరావు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## జాతీయాభివృద్ధిలో మైనింగ్‌దే కీలక పాత్ర

### ఎన్‌ఎండీసీ సీఎండీ అమితావ ముఖర్జీ

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : జాతీయాభివృద్ధిలో మైనింగ్ రంగానిదే కీలక పాత్ర అని, ఈ రంగం ఆర్థికంగా, సామాజికంగా అనేక మార్పులకు కారణమవుతుందని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌ఎండీసీ) సీఎండీ అమితావ ముఖర్జీ అభిప్రాయపడ్డారు. మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎంఈఐఏ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో మైనింగ్ ది మినరల్స్ వే ఫార్వార్డ్ టువర్డ్స్ ఆత్మనిర్భర్ వికసిత్ భారత్-2047 అంశంపై హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించారు. అమితావ ముఖర్జీతోపాటు సింగరేణి సీఎండీ ఎన్ బలరాం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమితావ ముఖర్జీ మాట్లాడుతూ.. సుస్థిర మైనింగ్ పద్ధతులను అనుసరించాలని, సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. మైనింగ్ విధానాలను సరళీకరించడం ద్వారా విదేశీపెట్టుబడులను ఆహ్వానించగలమని పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎంఎస్ వెంకటరమణయ్య, కార్యదర్శి ఎల్ కృష్ణ, సంయుక్త కార్యదర్శి వీ బాలకోటిరెడ్డి, కోశాధికారి సంజీవ్ కుమార్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

## కొమురయ్యకు రెండు సంఘాల మద్దతు

ఫైల్ నేం : 16 మల్లేశం 2 (91827 77951)

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న మల్క కొమురయ్యకు మరో రెండు సంఘాలు మద్దతుపలికాయి. తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, టీయూటీఎఫ్ మద్దతు పలికాయి. కొమురయ్య గెలుపునకు కృషిచేస్తామని ఇరు సంఘాల నేతలు తెలిపారు.























